ప్రభాత
ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 23 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శుక్రవారం 3 మే 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

# 6లక్షల ఉద్యోగాలు తొలగించారు

## మోడీ ప్రభుత్వంపై రాహుల్ విమర్శలు



న్యూఢిల్లీ, మే 2 (ప్రభాత ఉదయం): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బడుగు, బలహీన వర్గాల రిజర్వేషన్లు తొలగించాలని నరేంద్ర మోదీ కుట్రకు తెరలేపారని విమర్శించారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్‌లో ట్వీట్ చేశారు. 'ప్రభుత్వ ఉద్యోగాలు లేవు, ఉన్న రిజర్వేషన్లను తొలగిస్తున్నారు. దళితులు, గిరిజనులు, వెనకబడిన తరగతుల నుంచి రిజర్వేషన్లు లాక్కొనేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ప్రైవేటైజేషన్ పేరుతో బడుగుల నోట్లో మట్టి కొట్టే ప్రయత్నం చేస్తుంది అని' రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. '2013లో 14 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఉండేవి. 2023కు వచ్చే సరికి ఆ ఉద్యోగాల సంఖ్య 8.4 లక్షలకు చేరుకున్నాయి. బీఎస్ఎన్ఎల్, సెయిల్, బీహెచ్ఈఎల్ తదితర కంపెనీల నుంచి దాదాపు 6 లక్షల ఉద్యోగులను తొలగించారు. అలా తొలగించిన వారంతా రిజర్వేషన్‌తో కొలువు పొందినవారే. రైల్వే వంటి సంస్థల్లో కాంట్రాక్టుపై పని కల్పిస్తున్నారు. కొందరు ఉద్యోగులను తొలగిస్తున్నారు. ప్రధాని మోదీ ఉద్దేశంలో ప్రైవేటీకరణ అనేది దేశ వనరులను దోచుకోవడం, దీంతో బడుగు, బలహీన వర్గాల రిజర్వేషన్లను దొంగిలించడం. కాంగ్రెస్ పార్టీ ఇస్తోన్న గ్యారంటీలతో ప్రభుత్వ రంగాలు బలోపేతం అవుతాయి. సమాజంలో ఉన్న అన్ని వర్గాలకు ఉపాధి లభిస్తోంది. 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తాం' అని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.

# కవితకు మరోమారు నిరాశ

## బెయిల్ తీర్పు మే 6కు వాయిదా



న్యూఢిల్లీ, మే 2 (ప్రభాత ఉదయం): దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు మరోసారి నిరాశ ఎదురైంది. సీబీఐ కేసులో కవిత బెయిల్ పిటిషన్‌పై తీర్పును మే 6కి వాయిదా వేస్తూ రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈడీ, సీబీఐ రెండు కేసుల్లోనూ కవిత బెయిల్ పిటిషన్లపై తీర్పును మే 6న వెలువరిస్తామని జడ్జి కావేరి బవేజా గురువారం ప్రకటించారు. కాగా ఇదివరకే కవిత బెయిల్ పిటిషన్‌పై తీర్పు వాయిదా పడింది. ఏప్రిల్ 22న తీర్పును కోర్టు రిజర్వ్ చేసింది. గురువారం జైలా లేదా బెయిలా అనేది తేలుతుందని అంతా భావించారు. కానీ కవితను నిరాశకు గురిచేస్తూ తీర్పును మరోసారి కోర్టు వాయిదా వేసింది.మహిళగా కవిత బెయిల్‌కు అర్హురాలని, అరెస్ట్ నుంచి విచారణ వరకు కవితకు వ్యతిరేకంగా ఎటువంటి ఆధారాలు లేవని వాదనలు కవిత తరపు న్యాయవాదులు వాదనలు ..మిగతా 2లో

# నేటిరాత్రికి తిరిగి కెసిఆర్ బస్సు యాత్ర

## రామగుండంలో రాత్రి 8గంటలకు రోడ్‌షో

## నేటినుంచి వరుసగా ప్రచార షెడ్యూల్



హైదరాబాద్, మే 2 (ప్రభాత ఉదయం): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎన్నికల ప్రచారంపై ఎన్నికల సంఘం 48 గంటల పాటు నిషేధం విధించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో శుక్రవారం 8 గంటలకు ఈసీ విధించిన గడువు ముగియనున్న నేపథ్యంలో గులాబీ బాస్ బస్సు యాత్రను బీఆర్ఎస్ శ్రేణులు రీషెడ్యూల్ చేశాయి. ఈ నెల 3వ తేదీన శుక్రవారం సాయంత్రం 8 గంటల తర్వాత కేసీఆర్ బస్సు యాత్ర, రోడ్ షో ముందు ప్రకటించిన విధంగానే యథావిధిగా కొనసాగనుంది. శుక్రవారం సాయంత్రం 8 గంటల తర్వాత కేసీఆర్.. పెద్దపల్లి జిల్లా రామగుండంలో రోడ్ షో నిర్వహిస్తారు. అనంతరం అక్కడే బస చేయనున్నారు. శనివారం సాయంత్రం మంచిర్యాలలో రోడ్ షో, 5వ తేదీన సాయంత్రం జగిత్యాలలో రోడ్ షో నిర్వహిస్తారు. 6వ తేదీన సాయంత్రం నిజామాబాద్ రోడ్ షో, 7వ తేదీన కామారెడ్డి రోడ్ షో.. అనంతరం మెదక్ లో రోడ్ షోలో ..మిగతా 2లో

# ఆదివాసులపై బిజెపికి ప్రేమలేదు

### పోడు భూముల పరిష్కారంలో కెసిఆర్ నిర్లక్ష్యం
### ఆదివాసీ మహిళ సుగుణకు టిక్కెట్ ఇచ్చాం
### తుమ్మిడిహట్టిని నిర్లక్ష్యం చేసిన కెసిఆర్
### టిక్కెట్ ఇవ్వకుండా సోయం బాపూరావుకు అవమానం
### రిజర్వేషన్లు ఉండాలంటే..కాంగ్రెస్ గెలవాలి
### ఆదిలాబాద్ సభలో సిఎం రేవంత్ ఉద్ఘాటన



ఆసిఫాబాద్, మే 2 (ప్రభాత ఉదయం): ఆదివాసులపై బీజేపీకి ప్రేమ లేదని, వారిపై వివక్ష చూపుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో సోయంబాపు రావు ఎంపీగా గెలిపిస్తే బీజేపీ ఎలాంటి అభివృద్ధి ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఆదివాసుల పట్ల బీజేపీకి ప్రేమ ఉంటే ఇక్కడి ఎంపీకి ఎందుకు మంత్రి పదవి ఇవ్వలేదని నిలదీశారు. చివరికి సోయం బాపురావుకు బీజేపీ టికెట్ ఇవ్వకుండా అవమా నించిందని ధ్వజమెత్తారు. ఆసిఫా బాద్‌లో గురువారం రేవంత్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎమ్మెల్యే బొజ్జు, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ పాల్గొన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 'జనజాతర' భారీ బహిరంగ సభలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. పేదోళ్లను బీజేపీ అభ్యర్థి గొడం నగేష్ అవమానిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు జిల్లా అభివృద్ధికి ఏం చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ మొదటి సారిగా ఆదివాసీ మహిళకు ఎంపీగా అవకాశం ఇచ్చిందని తెలిపారు. మహిళలంతా కలిసి సుగుణను ఎంపీగా గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఆదిలాబాద్ పార్లమెంట్‌లో సాగునీరు, పోడు భూముల ..మిగతా 2లో



# ఓటమి భయంతోనే.. పాలమూరులో కాంగ్రెస్ నీచ రాజకీయాలు

## బిజెపి ఎంపీ అభ్యర్థి డీకే అరుణ

### మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో మక్తల్ నియోజకవర్గంలో, జోరుగా బీజేపీ లోకసభ ఎన్నికల ప్రచారం

మక్తల్, మే 2(ప్రభాత ఉదయం)ఓటమి భయం తోనే.. పాలమూరులో కాంగ్రెస్ నీచ రాజకీయాలు చేస్తుందని బిజెపి ఎంపీ అభ్యర్థి డీకే అరుణ ఆరోపించారు. గురువార మక్తల్ టౌన్, ఉట్కూరు, బిజ్వారం, పులిమామిడి, జకలర్ గ్రామాల్లో రోడ్ షోలో బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ పాల్గొన్నారు. అరుణమ్మ రోడ్ షోలో భారీగా పాల్గొని బిజెపి శ్రేణులు, స్థానికులు డప్పు చప్పుళ్ళు.. బ్యాండ్ మేళాలు, బాణాసంచా మోతలు, జైఅరుణమ్మ నినాదాలు చేస్తూ.. అరుణమ్మ కు అడుగడుగునా నిరాజనాలు పలికారు. సీఎం రేవంత్ రెడ్డి పై మహబూబ్ నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి జిల్లాలో మా కుటుంబం పై ఈ కల్వకుర్థోళ్ళు కక్ష కట్టారని ఫైర్ అయ్యారు. ఆనాడు జైపాల్ రెడ్డి మొదలు.. ఇప్పటి సీఎం రేవంత్ వరకు నన్ను నా కుటుంబాన్ని అనగదొక్కలని ..మిగతా 2లో



# అమిత్ షా వీడియో మార్ఫింగ్ కేసు

## కాంగ్రెస్ సోషల్ మీడియాకు చెందిన ముగ్గురి అరెస్ట్

హైదరాబాద్, మే 2 (ప్రభాత ఉదయం): బీజేపీ అగ్రనేత, కేంద్రమంత్రి అమిత్ షా వీడియో మార్ఫింగ్ కేసులో హైదరాబాద్ పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు. కాంగ్రెస్ సోషల్ మీడియా ఇంఛార్జ్ మన్నే సతీష్ తో పాటు నవీన్, తస్లీమాలను అరెస్ట్ చేశారు. బీజేపీ నేత ప్రేమేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఢిల్లీ పోలీసుల నోటీసుల కంటే ముందే హైదరాబాదులో కేసు నమోదైంది. గురువారం ముగ్గురిని అరెస్ట్ చేసి హైదరాబాద్ సీపీఎస్‌కు తరలించారు. కాగా రిజర్వేషన్లపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలను వక్రీకరించారన్న వివాదం నేపథ్యంలో 'డీప్‌ఫేక్' వీడియోలపై ఢిల్లీ హైకోర్టులో పిల్ దాఖలైంది. లోక్‌సభ ఎన్నికలను ప్రభావితం చేస్తున్నందున డీప్‌ఫేక్ వీడియోల వ్యాప్తిని, ప్రసారాన్ని అరికట్టేలా ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలని న్యాయవాదుల బృందం ఈ పిల్‌లో కోరింది. సీనియర్ న్యాయవాది జయంత్ మెహతా బుధవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మన్మీత్ ప్రీతమ్‌సింగ్ అరోరాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందు ఈ పిటిషన్ గురించి ప్రస్తావించారు.

# చేవెళ్ల గడ్డపై బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం పక్కా



హైదరాబాద్, మే 2 (ప్రభాత ఉదయం): మండుటెండలో సుడిగాలి పర్యటన చేస్తూ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ%ొ% కేసీఆర్ బస్సు యాత్రకు అన్యూహ్య స్పందన వస్తుందని 12 సీట్లలో బీఆర్ఎస్ గెలుస్తుందని నివేదికలు రావటంతో బీజేపీ-కాంగ్రెస్ కుమ్మక్కై కేసీఆర్ 48 గంటలు ప్రచారాన్ని అడ్డుకుంటున్నారన్నారు. 5 నెలల్లో రేవంత్ పరిపాలన చూసి కేసీఆర్‌ని ఎందుకు వదులుకున్నాం అని నేడు ప్రజలు బాధపడుతున్నారన్నారు. కేసీఆర్ పాలనలో రెప్పపాటు కరెంట్ పోకుండే ఇపుడు తరుచూ పోతుందన్నారు. మోడీ,రేవంత్ రెడ్డిలు ఎన్నికల ప్రచారాల్లో మాట్లాడింది కనిపించటం లేదా అని ప్రశ్నించారు. 96 బీసీ కులాలను ..మిగతా 2లో

# 5న అమిత్ షా, 6న జేపీ నడ్డా తెలంగాణలో పర్యటన



న్యూఢిల్లీ, మే 2 (ప్రభాత ఉదయం): 5 న అమిత్ షా, 6న జేపీ నడ్డా తెలంగాణలో పర్యటించనున్నారు. కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా ప్రచార షెడ్యూల్‌ను బీజేపీ విడుదల చేసింది. 5న ఉదయం 11:30 గంటలకు ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం సిర్పూర్ కాగజ్నగర్ లో బహిరంగ సభలో అమిత్ షా పాల్గొంటారు. మధ్యాహ్నం 1.30 గంటలకు నిజామాబాద్ పార్లమెంట్ నిజామాబాదులో బహిరంగ సభకు విచేస్తారు. సాయంత్రం 4 గంటలకు మల్కాజ్ గిరి లోక్ సభ ఎన్నికల ..మిగతా 2లో



# కెసిఆర్ బస్సుయాత్రతో కాంగ్రెస్, బిజెపిల్లో దడ

## అందుకే ఆగమేగాల మీద 48 గంటల నిషేధం

### కేంద్రం చేతిలో ఈసీ కీలుబొమ్మగా మారింది
### మా ఫిర్యాదులపై మాత్రం పట్టింపు లేదు
### రేవంత్ భాషపై ఫిర్యాదు చేసిన చర్యల్లేవ్
### మీడియా సమావేశంలో కెటిఆర్

హైదరాబాద్, మే 2 (ప్రభాత ఉదయం): బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ బస్సు యాత్ర ప్రారంభంతో కాంగ్రెస్, బీజేపీ నేతల గుండెల్లో దడ పుట్టిందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. కేసీఆర్ బస్సు యాత్రకు వస్తున్న ప్రజా స్పందనను చూసి ఆ రెండు పార్టీలు ఓర్వలేకపోతున్నాయని కేటీఆర్ మండిపడ్డారు. అందుకే మోడీ, రేవంత్ ఒక్కటై ఇసితో నిషేధం విధించారని అన్నారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ ..మిగతా 2లో

# ఆదివాసులపై బిజెపికి ప్రేమలేదు

మొదటి పేజీ తరువాయి...

సమస్య ఉందని చెప్పుకొచ్చారు. తుమ్మడిహట్టి ప్రాజెక్టును మాజీ సీఎం కేసీఆర్ నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. సీసీఐ మూతపడితే కేసీఆర్, మోదీ పట్టించుకోలేదని మండిపడ్డారు. జిల్లాలో చాలా వనరులు ఉన్నా.. ఎలాంటి అభివృద్ధి ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. 3నెలల్లో 30వేల ఉద్యోగాలు ఇచ్చామని స్పష్టం చేశారు. బలహీన వర్గాలకు కులగనణ చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలియచేశారు. బీజేపీ పార్టీపై విమర్శలు చేశారు సీఎం రేవంత్ రెడ్డి. దేశంలో రాజ్యాంగాన్ని మర్చేందుకు కుట్ర జరుగుతుందని ఆరోపించారు. ఈ దేశంలో ఉన్న రిజర్వేషన్లు రద్దు చేయాలని బీజేపీ చూస్తుందని విమర్శించారు. అందుకే 2021లో జరగాల్సిన జనాభా లెక్కలు చేయలేదని తెలిపారు. రిజర్వేషన్లు రద్దు చేయాలన్న రహస్య ఒప్పందం నడిచిందని అందుకే కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న 8 రాష్ట్రాల ప్రభుత్వాలను కూల్చిందని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి 400 సీట్లు వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారని అన్నారు. ఓటు వేసి రిజర్వేషన్ ను రద్దు చేయించుకుంటారా అని ప్రజలను అడిగారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు రద్దు చేయాలన్న కుట్ర బీజేపీ చేస్తుందని ఆరోపించారు. ఇవి మాట్లాడితే తనపై కేసులు పెడుతున్నారని విమర్శించారు. రిజర్వేషన్లు ఉండాలంటే కాంగ్రెస్ గెలవాలని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కులగణన చేస్తుందని రిజర్వేషన్లు ఇంకా పెరిగే అవకాశం ఉందని అన్నారు. తెలంగాణకు బీజేపీ గాడిద గుడ్డు ఇచ్చిందని విమర్శించారు. కేసీఆర్ మోదీ తెలంగాణకు ఏం చేయలేదని ఆరోపించారు. సోయం బాపూరావును ఎంపీగా గెలిపిస్తే ఆదిలాబాద్ కు ఏం ఇచ్చారని ప్రశ్నించారు. ఆదిలాబద్ పార్లమెంట్ సీటును ఏ పార్టీ కూడా ఇంత వరకు మహిళకు ఇవ్వలేదని ఫస్ట్ టైం సోనియా గాంధీ ఆత్రం సుగుణకు ఇచ్చారని ఆమెను భారీ మెజారిటీతోని గెలిపించాలని కోరారు. అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోను ఐదు గ్యారెంటీలు అమలు చేశామని తెలిపారు. 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.



## నేటి రాత్రికి తిరిగి కెసిఆర్ బస్సు యాత్ర

మొదటి పేజీ తరువాయి...

పాల్గొంటారు. ఈ నెల 8వ తేదీన నర్సాపూర్ అనంతరం పటాన్ చెరులో రోడ్ షో నిర్వహిస్తారు. నెల 9న సాయంత్రం కరీంనగర్ లో గులాబీ బాస్ బస్సుయాత్ర, సాయంత్రం రోడ్ షో ఉంటుంది. 10వ తేదీన చివరి రోజు సిరిసిల్లలో రోడ్ షో అనంతరం సిద్ధిపేటలో బహిరంగ సభతో కేసీఆర్ బస్సు యాత్ర ముగియనుంది. కాగా, సిరిసిల్ల ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీపై అవమానకరమైన, అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసినందుకు గానూ కేసీఆర్ ఎన్నికల ప్రచారంపై కేంద్ర ఎన్నికల సంఘం 48 గంటల పాటు నిషేధం విధించింది. ఏప్రిల్ 5న కేసీఆర్ ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ తో పాటు, తమ పార్టీ నేతలను ఉద్దేశించి అభ్యంతరకరంగా, అవమానకరంగా వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ నేత నిరంజన్‌రెడ్డి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. అది ఎన్నికల నియమావళికి పూర్తిగా విరుద్ధమని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన ఈసీ.. కేసీఆర్ నుంచి సైతం వివరణ సేకరించింది. తెలంగాణ మాండలికాన్ని స్థానిక అధికారులు పూర్తిగా అర్థం చేసుకోలేకపోయారని ఆయన వివరణ ఇచ్చారు. దీనిపై సంతృప్తి చెందని ఈసీ.. గులాబీ బాస్ ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని భావించి చర్యలు తీసుకుంది. బహిరంగ సభలు, ప్రదర్శనలు, ర్యాలీలు, ఇంటర్వ్యూలు, రోడ్ షోలు, మీడియాలో బహిరంగంగా మాట్లాడొద్దని సూచించింది. బుధవారం రాత్రి 8 గంటల నుంచి 48 గంటల పాటు ఈ నిషేధం వర్తించేలా ఉత్తర్వులు జారీ చేసింది. అదే సమయంలో ఎలక్ట్రానిక్ మీడియా, సామాజిక మాధ్యమాలు, ప్రింట్ మీడియాల ద్వారా ఎక్కడా ఎలాంటి ప్రచారం నిర్వహించకూడదని స్పష్టం చేసింది. మహబూబాబాద్ పట్టణంలో ప్రచారంలో ఉండగా ఈసీ అధికారులు కేసీఆర్ బస్సు యాత్ర వద్దకు చేరుకుని నోటీసులు అందించగా.. ఈసీ సూచన మేరకు బుధవారం రాత్రి 8 గంటల ముందుగానే కేసీఆర్ ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలోని తన నివాసానికి వెళ్లిపోయారు. ఈసీ గడువు ముగిసిన అనంతరం శుక్రవారం సాయంత్రం 8 గంటల తర్వాత మళ్లీ బస్సు యాత్ర కొనసాగించనున్నారు.

## చేవెళ్ల గడ్డపై బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం పక్కా

మొదటి పేజీ తరువాయి...

ఏకం చేసిన గొప్ప నాయకులు కాసాని జ్ఞానేశ్వర్ ని గెలిపించుకుని సత్తా చాటాలన్నారు. పాలమూరు రంగారెడ్డికి జాతీయ హెూదా కోసం పార్లమెంట్ లో గట్టిగా పోరాటం చేస్తారన్నారు. కేసీఆర్ తయారు చేసిన ఇద్దరు నేతలే కాసాని జ్ఞానేశ్వర్ కి పోటీగా వస్తున్నారని, వారిద్దరికీ ఓటుతో బుద్ధి చెబుతాం అన్నారు. 2 లక్షల రుణమాఫీ,4 వేల పెన్షన్, రైతు బంధు ఎకరాకు 15 వేలు డిసెంబర్ 9 నాడే ఇస్తామని నేటికి ఇవ్వలేదని, గతంలో ఇచ్చిన రైతు బంధు కూడా నాలుగు, ఐదు ఎకరాల వరకే ఇచ్చారని, పెన్షన్లు రెండు వేల రూపాయలే ఇచ్చి ఒక నెల 25 వ తేదీన, మరొక నెల ఇవ్వనే లేదన్నారు. ప్రజలంతా కసిగా కారు గుర్తుకు ఓటు వేసి అబద్ధాల ప్రచార కాంగ్రెస్ కు బుద్ధి చెప్పాలన్నారు.ఆగస్ట్ 15 వ తేదీన 2 లక్షల రుణమాఫీ చేస్తామని దేవుళ్ళ మీద ముఖ్యమంత్రి ఒట్టు వేస్తున్నారని, ఆ మాటలను ప్రజలు నమ్మటం లేదన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం పదేళ్లు ఏమి చేయలేదని, మోడీని చూసి ఓట్లు వేయమని బీజేపీ అభ్యర్థి అభ్యర్థిస్తున్నారని పేర్కొన్నారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఎక్కడ అని, ఒక్క విద్యాలయం ఇవ్వలేదని, పాలమూరు రంగారెడ్డికి జాతీయ హెూదా ఇవ్వలేదని విమర్శించారు. కళ్యాణలక్ష్మి లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. పాలన అనుభవం లేక రాష్టం అస్తవ్యస్తంగా మారిందని, 200 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, 24 గంటల్లో జాబితా ఇవ్వమంటే 4 గంటల్లోనే ఇచ్చిన నేటికి స్పందన లేదన్నారు. కేసీఆర్ కష్టాల్లో ఉన్న రైతుల వద్దకు వెళ్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్టేడియంలో క్రికెట్ మ్యాచ్ చూస్తున్నారని,ప్రజల పట్ల, రైతుల పట్ల ఆయనకు ఉన్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనం అన్నారు. పచ్చని అడవులను పాడు చేసే రాడార్ వ్యవస్థను గతంలో కేసీఆర్ అడ్డుకుంటే నేడు ప్రభుత్వం తీసుకువచ్చే ప్రయత్నం చేస్తుందన్నారు.

## కవితకు మరోమారు నిరాశ

మొదటి పేజీ తరువాయి...

వినిపించారు. బీఆర్ఎస్ పార్టీకి స్టార్ క్యాంపైనర్‌గా ఉన్నందున ఎన్నికల్లో ప్రచారం కోసం బెయిల్ ఇవ్వాలని కవిత కోరారు. ఏడేళ్ల లోపు శిక్ష పడే కేసులకు అరెస్ట్ అవసరం లేదని, కవిత అరెస్టుకు సరైన కారణాలు లేవని, మహిళగా ఆరోగ్యపరమైన కారణాలు పరిగణలోకి తీసుకొని బెయిల్ మంజూరు చేయాలని కవిత న్యాయవాదులు కోర్టుకు విజ్ఞప్తి చేశారు. లిక్కర్ కేసులో కవిత కీలక వ్యక్తిగా ఉన్నారని సీబీఐ తరపు లాయర్లు వాదించారు. ఈ కేసుకు సంబంధించి చాలా విషయాలు కవితకు తెలుసునని, ఇతరులు ఇచ్చిన స్టేట్‌మెంట్స్, ఆధారాలపై ఆమెను విచారించినా నిజాలు చెప్పడం లేదని కోర్టుకు సీబీఐ న్యాయవాదులు తెలిపారు. హై పొలిటికల్ పవర్ ఉన్న కవిత ఈ కేసు దర్యాప్తును ఆధారాలు సాక్ష్యాలను ప్రభావితం చేయగలరని బెయిల్ ఇవ్వొద్దని సీబీఐ వాదించింది. ఇంతకు ముందు ఎక్సైజ్ పాలసీ కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, కే కవిత జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 7వ తేదీ వరకు పొడిగిస్తూ రౌస్ అవెన్యూ కోర్టు తీర్పునిచ్చింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో మార్చి 15న ఈడీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

## 5న అమిత్ షా, 6న జేపీ నడ్డా తెలంగాణలో పర్యటన

మొదటి పేజీ తరువాయి...

ప్రచారంలో పాల్గొననున్నారు అమిత్ షా. ఈ నెల 6న బీజేపీ జాతీయ అధ్యక్షులు జగత్ ప్రకాష్ నడ్డా 11 గంటలకు పెద్దపల్లి లో మధ్యాహ్నం 1గంటకు, భువనగిరిలో మధ్యాహ్నం 3.30 గంటలకు నల్గొండలో జరగనున్న బహిరంగ సభలకు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఇదిలా ఉంటే.. కేంద్ర హెూంమంత్రి అమిత్ షా వీడియో మార్ఫింగ్ కేసులో ఢిల్లీ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. హైదరాబాద్ చేరుకున్న ఢిల్లీ పోలీసులు నిందితుల ఆచూకీ కోసం ఆరా తీస్తున్నారు. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి ఐదుగురిని హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వీరిని గచ్చిబౌలి పోలీసులు అదుపులోకి తీసుకుని సీసీఎస్ పోలీసులకు అప్పగించారు. ప్రస్తుతం పోలీసుల అదుపులో మన్నే సతీష్, అస్మా, తస్లీమా, గీత, శివ ఉన్నారు.

## కెసిఆర్ బస్సుయాత్రతో కాంగ్రెస్, బిజెపిల్లో దడ

మొదటి పేజీ తరువాయి...

సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన పరుష పదజాలం మీద ఎన్నికల సంఘానికి 8 ఫిర్యాదులు ఇచ్చాం. కానీ చర్యల్లేవు. కేసీఆర్‌ను ఉరితీస్తాం.. లాగుల తొండలు వదులుతాం.. ముడ్డి మీద డ్రాయర్ కూడా ఉండదు.. కేసీఆర్ తల నరకండి.. కేసీఆర్ తల తెగ్గోయండి అని రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఈ మాటలు ఎన్నికల సంఘానికి నీతిసూక్తులు, సుభాషితాల్లాగా వినబడుతున్నట్లుంది. ఈ మాటలు ఈసీకి వినిపించవు. అదే కేసీఆర్ నేతన్నలు, రైతుల పక్షాన మాట్లాడితే గట్టిగా ఒక్క మాట మాట్లాడితే.. 48 గంటల నిషేధం విధించారు అని కేటీఆర్ తెలిపారు. బడా భాయ్.. చోటా భాయ్ కనుసన్నల్లో కేంద్ర ఎన్నికల సంఘం పని చేయకపోతే.. తామిచ్చిన 27 ఫిర్యాదులపై స్పందించాలి. రేవంత్ మీద 8, మరో 19 ఫిర్యాదులు మిగతా పార్టీ నాయకులు, వారి వైఖరి మీద ఈసీకి ఫిర్యాదు చేశాం. ఒక్కటంటే ఒక్కదాని మీద కూడా చర్య లేదు. కొండా సురేఖకు మందలింపు తప్ప ఒక్కటంటే ఒక్క చర్య లేదు. వారి ప్రచారాన్ని నిషేధించలేదు. కేసీఆర్ బస్సు యాత్ర ప్రారంభించగానే కాంగ్రెస్‌కు, బీజేపీకి దడ పుట్టింది. స్టేట్‌లో ఇంటెలిజెన్స్ రిపోర్ట్, కేంద్రంలో ఐబీ రిపోర్టు ఎప్పటికప్పుడు ఇస్తున్నాయి. కేసీఆర్ బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. మంచి స్పందన వస్తుందని ఆ పార్టీలకు కంటగింపుగా మారింది. 2014లో బడా భాయ్ చేసిన మోసం, 2023లో చోటా భాయ్ చేసిన మోసాన్ని పూసగుచ్చినట్టు ప్రజలకు వివరిస్తుంటే.. తట్టుకోలేక ప్రజల దృష్టిని మరల్చేందుకు ఇది ఒక పన్నాగం అనేది పార్టీ స్థిరమైన అభిప్రాయం అని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ బస్సు యాత్రకు జనస్పందన చూసిన తర్వాత రెండు పార్టీలకు నిద్ర పట్టడం లేదు. 8 -12 సీట్లు బీఆర్ఎస్‌కు వస్తున్నాయని సర్వేలు వస్తున్నాయి. మొన్నటి దాకా బీఆర్ఎస్‌ను ఒక్క సీటు కూడా గెలవనివ్వం అని అన్నారు. కేసీఆర్ బస్సు యాత్ర తర్వాత వస్తున్న స్పందనను జీర్ణించుకోలేక ఇద్దరు కూడబలుక్కొని కేసీఆర్‌ను ప్రజల వద్దకు వెళ్లనీయకుండా ఆపడం అప్రజాస్వామిక చర్య. ప్రజలు దీనికి ఓటుతోనే సమాధానం చెప్తారని అనుకుంటున్నాను అని కేటీఆర్ తెలిపారు. రేవంత్ రెడ్డి ఇంకా చండాలంగా మాట్లాడారు. ఆ మాటలు మేం అనేందుకు సిగ్గు అనిపిస్తుంది. ఆయన మాటలపై ఫిర్యాదు చేస్తే.. గోడకు చెప్పుకున్నట్టే ఉంది కానీ ఈసీ నుంచి స్పందన లేదు. కానీ కేసీఆర్ పట్ల రాకెట్ వేగంతో స్పందించి నిషేధం విధించారు. మీది నిజంగా స్వయం ప్రతిపత్తి సంస్థ అయితే.. ఎందుకు మోదీ మీద చర్యల్లేవు. మోదీకి నోటీసులు ఇవ్వాలంటే ఎందుకు వణికి చచ్చిపోతున్నారు. నడ్డాకు ఎందుకు ఇస్తున్నారు. రేవంత్ రెడ్డి విషయంలో మీ గొంతు ఎందుకు పెగడలం లేదు..? 48 గంటల పాటు కేసీఆర్ ప్రచారాన్ని నిషేధించొచ్చు కానీ కేసీఆర్ తయారు చేసిన సైన్యాన్ని మీరు అడ్డుకోలేరు అని కేటీఆర్ తేల్చిచెప్పారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ కనుసన్నల్లో కేంద్ర ఎన్నికల సంఘం నడుస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడుతున్న మోదీకి, అమిత్ షాకు నోటీసులు జారీ చేయరు. కానీ ఆవేదనతో మాట్లాడిన కేసీఆర్‌కు మాత్రం నోటీసులు జారీ చేసి, 48 గంటల పాటు ప్రచారంపై నిషేధం విధించారని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఇవాళ రాష్ట్రంలో, దేశంలో ఉన్న పరిస్థితులు చూస్తుంటే.. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం, వారు తీసుకున్న నిర్ణయాలు దానికి అనుగుణంగా జరిగిన నియామకాలు, స్వయం ప్రతిపత్తి సంస్థలను తమ గుప్పిట్లో పెట్టుకుని ఆటాడిస్తున్నట్లు స్పష్టమవుతుంది. చివరకు ఎన్నికల కమిషన్ కూడా బీజేపీ కనుసన్నల్లో నడుస్తోంది. ఇందులో ఎలాంటి రెండో ఆలోచన, అభిప్రాయం తమకు లేదు. దేశంలో బీజేపీ వాళ్లు జాతులు, మతాల ఆధారంగా.. ప్రధాని, హోం మంత్రి మత వైషమ్యాలు రెచ్చగొట్టేలా మాట్లాడిన, విద్వేషాన్ని రెచ్చగొట్టేలా దారుణమైన వ్యాఖ్యలు చేసినా, ప్రత్యర్థ పార్టీలను బీజేపీ నాయకులు బండబూతులు తిడుతున్నా.. వాళ్ల బీజేపీ4ఇండియా అఫిషియల్ ట్విట్టర్ ముస్లింలపై విషం చిమ్ముతూ.. ప్రచారం చేస్తున్నా ఒక్క చర్య లేదు. కేంద్ర ఎన్నికల సంఘం ఎలాంటి నోటీసులు జారీ చేయలేదు అని కేటీఆర్ తెలిపారు. ఇటీవలే మోదీ దారుణంగా మాట్లాడారు. ఈ దేశంలో ముస్లింలే ఎక్కువ పిల్లలు కంటారని, వేరే వారు అధికారంలోకి వస్తే దేశ సంపదను ముస్లింలకు దోచి, పంచి పెడుతారని ఇష్టారీతిన వ్యాఖ్యలు చేస్తే దాదాపు 25 వేల మంది పౌరులు ఎన్నికల కమిషన్‌కు ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. కానీ కనీసం మోదీకి నోటీసు కూడా ఇవ్వలేదు. చర్యలు తీసుకోవడం లేదు. మోదీకి భయపడ్డ ఎన్నికల సంఘం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు నోటీసులు జారీ చేశారు. మోదీ వ్యాఖ్యలపై నడ్డా జవాబు ఇవ్వాలని తలాతోక లేని నిర్ణయం ఎన్నికల కమిషన్ తీసుకుంది అని కేటీఆర్ గుర్తు చేశారు. ఎన్నికల్లో దేవుడిని, మతాన్ని ఇన్‌వాల్వ్ చేయడం నేరం. అమిత్ షా శ్రీరాముడి బొమ్మ పట్టుకుని ఎన్నికల ప్రచారం చేశారు. దీనిపై కూడా ఫిర్యాదు చేశారు. ఎన్నికల కమిషన్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. అయినా ఉలుకు పలుకు లేదు. బీజేపీ అభ్యర్థి అరుణ్ గోవిల్ గతంలో రామాయణం సీరియల్‌లో రాముడి పాత్ర పోషించారు. ఆయన రాముడి ఫొటోతో ప్రచారం చేశారు. చర్య, నోటీసులు లేవు. బీజేపీ4 ఇండియా అఫిసియల్ ట్విట్టర్‌లో రాముడి ఫోటో పెట్టి మీ ఓటును బీజేపీకి వేయాలని ప్రేరేపిస్తున్నారు. మోదీ విద్వేషపూరితమైన వ్యాఖ్యలు చేసినా, హోం శాఖ మంత్రి రాముడి ఫొటో పట్టుకుని ఓట్లు అడిగానా ఉలుకు పలుకు లేదు. మత విద్వేషాలను రెచ్చగొట్టేలా, హిందూ ముస్లింలను విడదీసేలా బీజేపీ4ఇండియా దాడి చేసినా ఎన్నికల కమిషన్ మేల్కోవడం లేదన్నారు కేటీఆర్.



## ఓటమి భయంతోనే పాలమూరులో కాంగ్రెస్ నీచ రాజకీయాలు

మొదటి పేజీ తరువాయి...

కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. ఆరోజు జైపాల్ రెడ్డి నాకు టికెట్ రాకుండా చేసారని మండి పడ్డారు. అంతేకాదు మా తండ్రి చిట్టెం నర్సిరెడ్డి కి, అక్కడ ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి జైపాల్ రెడ్డి ఓర్వలేక పోయడానికి అన్నారు. అ కోపంతోనే మహాభాబ్ నగర్ పార్లమెంట్ లో ఉన్న అలంపూర్, గద్వాలను మహబూబ్ నగర్ లోంచి నగర్ కర్నూల్ పార్లమెంట్ లో కలిపారని గుర్తు చేసారు.

### అరుణమ్మ కామెంట్స్

ఒక ఆడపిల్లను అయినా ఉమ్మడి జిల్లా మొత్తం పని చేశాను, ఉమ్మడి జిల్లా మంత్రి గా 14 నియోజకవర్గాలలో డీకే అరుణమ్మ పనిచేసిందని గుర్తు చేశారు. ప్రజల కోసం, ఈ ప్రాంతంలోని సాగునీటి ప్రాజెక్ట్ ల్ కోసం పోరాటం చేశానన్నారు. కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వకున్నా ఇండిపెండెంట్ గా గెలిచిన చరిత్ర నాదన్నారు.- ఇండిపెండెంట్ గా గెలిచి కల్వకుర్తి ప్రాజెక్టు, నెట్టెంపాడు ప్రాజెక్టు తీసుకువచ్చింది నేనే నన్నారు. పాలమూరుకు అరుణమ్మ ఏం చేసిందని అడిగే... ఈ దద్దమ్మలు ఆ రోజు ఎక్కడున్నారో చెప్పాలన్నారు. బ్లాక్మెయిల్ చేసి సంపాదించినా సన్యాసులు... కాంగ్రెస్, టిఆర్ఎస్ నాయకులు విల్లా నా గురించి మాట్లాడేటోళ్ళు అని డీకే అరుణ మండిపడ్డారు.

### రేవంత్‌ను ఉతికిరేసిన అరుణమ్మ...

అరుణమ్మను రాజకీయంగా ఎదురుకోలేక రేవంత్ రెడ్డి వెనకనుంచి వ్యక్తిగతంగా దాడి చేస్తున్నారు. పనిగట్టుకొని నాపై సోషల్ మీడియాలో వ్యక్తిగతంగా అవమాన పరిచెలా పోస్టులు పెట్టిస్తూ, నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు .ఈ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన చేతగానోడు. ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతగాక నా మీద ఏడుస్తున్నారు . ఇక్కడ అరుణమ్మ ఏం చేసిందో మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరికి తెలవదా అన్నారు. గెలిచినా ఓడినా ఇక్కడే ఉంటానన్నారు. ఇప్పుడున్న నాయకులు ఆరోజు ఎక్కడున్నారు..? కాంగ్రెస్ ,బిఆరెస్ అభ్యర్థులు ఇక్కడ ఉండి పనిచేసే వాళ్ళో కాదో ప్రజలకు తెలుసు.కానీ నేను గెలిచినా, ఒడినా మీతోనే ఉన్నా, ఉంటాను కూడ ఎందుకంటే ఇది నా ప్రాంతం అన్న మమకారం ఉందన్నారు. ఇప్పుడున్న కాంగ్రెస్, బిఆరెస్ అభ్యర్థులలో ఎవ్వరు గెలిచిన తర్వాత జిల్లా వైపు కూడా చూడరు ఎవరు ఏం చేయలేదు- పాలమూరు జిల్లాకు జైపాల్ రెడ్డి గానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏమి చేయలేదన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ నియోజకవర్గానికి ఏం చేశాడు చెప్పాలన్నారు.ఓర్వలేక కక్ష్యగట్టి..- నా తండ్రి నర్సిరెడ్డిని ఇబ్బందులు పెట్టిన వాళ్ళు, నాకు టికెట్ ఇవ్వకుండా కూడ ఇబ్బందులు పెట్టారు . ఇప్పుడు నా పెద్ద నాయకుడి వారసుల్లాగా మళ్లీ ముఖ్యమంత్రి రూపంలో వచ్చారు. డిలిమిటేషన్స్ ద్వారా అలంపూర్ , గద్వాల్ ని నాగర్ కర్నూల్ జిల్లాలో కలిపిన దుర్మార్గులు వీళ్లు అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా నుంచి నన్ను నా తండ్రిని విడదీయాలని చూసారు.బీమా ప్రాజెక్ట్ ను తెచ్చింది మా నాన్న నర్సిరెడ్డి.. ప్రాజెక్టు మధ్యలోనే నక్సలైట్లు కాల్చి చంపారన్నారు.

### మోదీ మీనియా...

ప్రపంచమంతా మోదీ మోదీ అంటుంది... ఈ ఎన్నికలు మూడోసారి మోడీ ప్రధాని కావడానికి జరుగుతున్న ఎన్నికలన్నారు. నరేంద్ర మోడీ లాంటి నాయకుడిని ఇప్పటివరకు భారతదేశం చూడలేదన్నారు. అరుణమ్మ హామీ మోదీ గ్యారంటీ, నన్ను నమ్మి గెలిపిస్తే అందరికి రేషన్ కార్డులు ఇప్పిస్తామన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద నిరుపేద వారికి ఇళ్ళు ఇస్తున్నారు. 500 ఏళ్లు గుడిసెలో ఉన్న రామున్ని నరేంద్రుడు ఇంట్లోకి పంపించాడన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయలేక ఓట్లకోసం కుల మతాలకు చిచ్చు పెడుతుందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి జిల్లా అధ్యక్షులు రామచంద్రారెడ్డి

## భారీ బహిరంగ సభను విజయవంతం చేద్దాం: బిజెపి జిల్లా అధ్యక్షులు రామచంద్రారెడ్డి

### ఈనెల 4న తేరు మైదానంలో బిజెపి బహిరంగ సభ

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 2(ప్రభాత ఉదయం ) నాగర్ కర్నూల్ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి పి భరత్ గెలుపు కోసం పార్టీ శ్రేణులు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని గద్వాల జిల్లా బిజెపి అధ్యక్షులు రామచంద్రారెడ్డి కోరారు . ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 4న బీజేపీ ఆధ్వర్యంలో గద్వాల పట్టణం తేరు మైదానంలో భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర సహకార ప్రసారాల శాఖ సహాయ మంత్రి మురుగన్, బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు , మహబూబ్ నగర్ పార్లమెంట్ అభ్యర్థి డికె. అరుణ, నాగర్ కర్నూల్ ఎంపీ రాములు, నాగర్ కర్నూల్ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి భరత్ ప్రసాద్ హాజరవుతున్నారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నాయకులు, ప్రజలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

## పాలమూరు ఎంపీపీ అభ్యర్థి డీకే అరుణ గెలుపు తథ్యం

### దేవరకద్ర నియోజకవర్గ బిజెపి ఇన్చార్జి కొండా ప్రశాంత్ రెడ్డి

### కొత్తకోటలో బిజెపి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న కొండా ప్రశాంత్ రెడ్డి

కొత్తకోట, మే2(ప్రభాత ఉదయం) పాలమూరు ఎంపీ బిజెపి అభ్యర్థి డీకే అరుణ ప్రచారంలో ఎక్కడికి వెళ్లినా ప్రజలు బ్రహ్మ రథం పడుతున్నారని దేవరకద్ర నియోజకవర్గ%శీ% బిజెపి ఇంచార్జ్ కొండా ప్రశాంత్ రెడ్డి అన్నారు. గురువారం కొత్తకోట మండల కేంద్రంలో బిజెపి లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటి తిరుగుతూ దేవరకద్ర నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డి కమలం గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ... కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వాన్ని ప్రజలు మూడోసారి పూర్తి విశ్వాసంతో కోరుకుంటున్నాను అన్నారు.బిజెపి బలపరిచిన పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణమ్మ కి ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు నెరవేర్చకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచిందని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలుగా వస్తున్న ఇప్పటివరకు రైతుబంధు డబ్బులు వేయలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అడ్డగోలు హామీలు ఇచ్చి ఇప్పుడు అవన్నీ మర్చిపోయిందని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో కొత్తకోట పట్టణ బిజెపి అధ్యక్షుడు నవీన్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర రెడ్డి, అసెంబ్లీ కోకండిరా భరత్ భూషణ్, దాబా శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్ నారాయణమ్మ వెంకట్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, పి రాఘవేంద్ర రెడ్డి, మహేష్ చారి, అమరేందర్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, మదిగట్ల శ్రీనివాస్ రెడ్డి, స్టార్ బాలు, రామచంద్రారెడ్డి, పి నరేందర్ రెడ్డి , పీజీ చింటూ, యాదిరెడ్డి, సబి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ అభ్యర్థి డీకే అరుణ గెలుపు కోసం ప్రచారం నిర్వహిస్తున్న బిజెపి యువ కార్యకర్తలు

# ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి


రెవరెండ్ అబ్రహాం లింకన్


రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్


రెవరెండ్ డాక్టర్ కె. నతానియెల్


రెవరెండ్ కె. సుందర్ పాల్

బుద్వేల్, మే2(ప్రభాత ఉదయం): ఈనెల 13వ తేదీన జరుగునున్న పార్లమెంటు ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని క్రైస్తవ మత పెద్దలు కొరుతున్నారు. ఓటు అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అని గుర్తు చేశారు. అన్ని వర్గాలకు ఓటు హక్కు ఉండాలని భారత రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ పోరాడి సాధించడం జరిగిందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని చెబుతున్న క్రైస్తవ మత పెద్దల మాటలలోనే.....

### ఓటు వజ్రాయుధం లాంటిది : రెవరెండ్ అబ్రహాం లింకన్

ప్రజాస్వామ్య దేశంలో ఓటు వజ్రాయుధం లాంటిది. ఐదు సంవత్సరాలకు ఒకసారి వచ్చే పార్లమెంటు ఎన్నికలలో ఓటు హక్కు ద్వారా సరైన నాయకున్ని ఎన్నుకునే అవకాశం లభిస్తుంది. మే 13న సెలవు దినం కాబట్టి ప్రతి ఒక్కరు పోలింగ్ బూతులకు వెళ్లి తమ ఓటును వేయాలి.

### మంచి నాయకులను ఎన్నుకోవాలి : రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్

పార్లమెంటు ఎన్నికల్లో మంచి నాయకున్ని ఎన్నుకోవాలి. ప్రజలకు అందుబాటులో ఉండి వారికి సేవ చేసే నాయకున్ని గుర్తించి పార్లమెంటుకు పంపించాలి. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు తమ ఓటును వినియోగించాలి. సెలవు ఉంది కదా అని ఇళ్ళకే పరిమితం కాకూడదు.

### 100 శాతం పోలింగ్ జరిగేటట్లు చూడాలి : రెవరెండ్ డాక్టర్ కె. నతానియెల్

కుల మతాలకతీతంగా ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు తమ ఓటు వేసి వంద శాతం పోలింగ్ జరిగేటట్లు చూడాలి. మెజారిటీ ఓటర్లు సరైన నాయకత్వాన్ని ఎన్నుకున్నప్పుడు ఆ ప్రాంతానికి, ప్రజలకు మేలు జరుగుతుంది. ప్రతి ఒక్కరు ఓటు వేయడానికి ముందుకు రావాలి.

### ఓటు వేయడం గొప్ప విషయం : రెవరెండ్ కె. సుందర్ పాల్

ఓటు వేయడం ఎంతో గొప్ప విషయం. భారతదేశంలో చట్టాలను రూపొందించే ప్రజా ప్రతినిధులను ఎన్నుకునే భాగ్యం ఓటర్లకే ఉంటుంది. అలాంటి సదవకాశాన్ని ఎవరు వదలకూడదు. ప్రతి ఒక్కరూ ఓటింగ్ లో పాల్గొనాలి. మంచి నాయకత్వాన్ని ఎన్నుకోవాలి.


రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ ఎన్నికల కో ఆర్డినేటర్ గా పలుగు చెరువు మహేష్ కు నియామక పత్రాన్ని అందచేస్తున్న చల్లా నర్సింహా రెడ్డి

## కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్ రెడ్డిని గెలిపించుకుంటాం

### పలుగు చెరువు మహేష్

బుద్వేల్, మే2(ప్రభాత ఉదయం): చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకుంటాం అని రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ ఎన్నికల కో ఆర్డినేటర్ పలుగు చెరువు మహేష్ అన్నారు. ఇటీవల బీఆర్ఎస్ కు రాజీనామా చేసి కాంగ్రెస్ లో చేరిన పలుగు చెరువు మహేష్ కు రాజేంద్రనగర్ ఎన్నికల కో ఆర్డినేటర్ గా నియమిస్తూ రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పలుగు చెరువు మహేష్ మాట్లాడుతూ , రంజిత్ అన్న గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు . నన్ను నమ్మి ఎన్నికలలో భాద్యత అప్పచెప్పిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్, ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి, , తెలంగాణ రాష్ట్ర మైనారిటీ గురుకులాల విద్యా సంస్థల వైస్ చైర్మన్ మహ్మద్ ఫహీమ్ ఖురేషి , రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చైర్మన్ చల్ల నర్సింహా రెడ్డి గారికి ,తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ , రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ కస్తూరి నరేందర్ ముదిరాజ్ కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ గెలుపుకోసం రాజేంద్రనగర్ డివిజన్ లో భారీ మెజారిటీ సాధించుటకు డివిజన్ పార్టీ అధ్యక్షునితో పాటు సీనియర్ నాయకులతో సమన్వయం చేస్తూ కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి గడ్డం రంజిత్ అన్న ను గెలిపించుకుంటామని తెలిపారు . నియామక పత్రం అందుకున్న సమయంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అనుముల జాన్ పాల్,పి మహేందర్, మేకం శుభాష్ తదితరులు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ పోలీస్ ఉన్నతాధికారులు

## బాబుల్ రెడ్డినగర్‌లోని ఓ గోదాములో... రూ.1.73 కోట్ల విలువ చేసే నల్లమందు స్వాధీనం

రాజేంద్రనగర్, మే 2 (ప్రభాత ఉదయం): కాటేదాన్ పరిశ్రామిక వాడ బాబుల్ రెడ్డి నగర్ లో మత్తుమందు స్థావరంపై ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్,ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి రూ. 1.73 కోట్ల విలువ చేసే నల్లమందును స్వాధీనం చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ్ గురువారం వివరాలను వెల్లడించారు. శంషాబాద్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాటేదాన్ బాబుల్‌రెడ్డినగర్‌లో గుట్కాలు తయారు చేసే ఓ కంపెనీపై విశ్వసనీయ సమాచారంతో ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది, ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేశారు. నల్ల మందును వివిధ బ్రాండ్స్ కు సంబంధించిన గుట్కా కవర్స్ లో ప్యాకింగ్ చేసి రాష్ట్రం అంతా కేటుగాళ్లు సరఫరా చేస్తున్నారు. ఒక్కో ప్యాకెట్ ను మూడు వేల రూపాయల చొప్పున విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు... కాటేదాన్ బాబూల్ రెడ్డి నగర్ లోని గోదాం పై దాడులు నిర్వహించిన ఎక్సైజ్,టాస్క్ ఫోర్స్ బృందం ఓ నిందితుడిని అరెస్టు చేయగా మరో వ్యక్తి పారిపోయాడు.ఓ బోలెరో వాహనం,10 మొబైల్ ఫోన్లు సీజ్ చేసినట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ్ వెల్లడించారు.అజర్ అనే వ్యక్తి గోదాం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. 27 కేజీల ఓపిఎం పాపి పౌడర్, 11 కేజీల ఓపీఎం స్ట్రా హస్క్, 1000 కేజీల టొబాకో ఓపిఎం మిక్చర్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఎన్ డీ పీ ఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ సమావేశంలో శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణప్రియ, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి, ఇన్స్పెక్టర్ దేవేందర్ రావు,టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, పలువురు ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.


పాస్టర్ సంజీవరావును సన్మానిస్తున్న దైవ సేవకులు

## బుద్వేల్‌కు చెందిన పాస్టర్ సంజీవ రావుకు సన్మానం

బుద్వేల్, మే2(ప్రభాత ఉదయం): సుదీర్ఘ కాలం పాటు దేవుని పరిచర్యలో కొనసాగుతున్న పాస్టర్ సంజీవ రావును గురువారం రాజేంద్రనగర్ మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సన్మానించారు.



## అన్ని దానాలలోకి అన్నదానం గొప్పది

### శివ సాయి దత్తు

శంషాబాద్, మే 2( ప్రభాత ఉదయం) అన్ని దానాలలోకి అన్నదానం ఎంతో గొప్పదని ఆకలితో ఉన్న వారికి కడుపునిండా అన్నం పెట్టడం మహాభాగ్యం అని శ్రీ ధర్మగిరి సాయిబాబా ఆలయం వ్యవస్థాపక ట్రస్ట్ శివ సాయి దత్తు పేర్కొన్నారు. గురువారం సాయిబాబా మందిరంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ ట్రస్ట్ చైర్మన్ ధరణి మాత లాంచనంగా ప్రారంభించారు. దేవాలయానికి వచ్చే ప్రతి ఒక్కరికి కడుపు నిండా అన్నం పెట్టడం కోసం ఆలయ ట్రస్ట్ ఎంతో కృషి చేస్తున్నదని అన్న వితరణ కార్యక్రమానికి పలువురు దాతలు కూడ ముందుకు రావడం ఎంతో సంతోషించేదగ్గ విషయమని శివ సాయి దత్తు పేర్కొన్నారు. వేల సంఖ్యలో వస్తున్న భక్తుల ఆకలి తీర్చడం బాబా కల్పించిన గొప్ప అవకాశం అని అన్నారు. ఈశ్వర అనుగ్రహంతో బాబా సన్నిధిలో పేదల ఆకలి తీర్చడం చాలా గొప్ప విషయమని దీనికి అందరూ సహకరించి ఈ కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకుపోవాలని సూచించారు.


బి ఆర్ ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు కోసం ప్రచారం నిర్వహి స్తూ శంషాబాద్ మండలం నాయకులు

## టిఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

### కే. చంద్రరెడ్డి

శంషాబాద్, మే 2. (ప్రభాత ఉదయం ) చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజును భారీ మెజార్టీతో గెలిపించాలని శంషాబాద్ మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొడిగంటి చంద్రారెడ్డి సూచించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం శంషాబాద్ మండలంలోని కవ్వ గూడ . చౌదరి గుడ. నర్కుడ గ్రామాలలో సీనియర్ నాయకుడు నీరటి రాజు ముదిరాజ్. డిసిసిబి డైరెక్టర్ బు రుకుంట సతీష్ లతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాలలో ఇంటింటికి తిరిగి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కెసిఆర్ నాయకత్వంలో జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ను పార్లమెంటుకు పంపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి ఆయన కృషి చేస్తారని చంద్రారెడ్డి తెలిపారు. బడుగు బలహీన వర్గాల ముద్దుబిడ్డ జ్ఞానేశ్వర్ ను పార్లమెంటుకు పంపించడం ద్వారా బీసీల ప్రాతినిధ్యం పెరుగుతుందని సీనియర్ నాయకుడు నేరటి రాజు ముదిరాజ్ పేర్కొన్నారు. టిఆర్ఎస్ను గెలిపిస్తేనే సంక్షేమ కార్యక్రమాలు మళ్ళీ ప్రజలకు సక్రమంగా అందుతాయని బురకుంట సతీష్ అన్నారు. ప్రచార కార్యక్రమంలో జెడ్పిటిసి తన్వి రాజు ముదిరాజ్. ఎంపీపీ జయమ్మ శ్రీనివాస్. కవ్వగూడా గ్రామ సర్పంచ్ దేవరకొండ రమేష్ యాదవ్. చౌదర్ గూడ గ్రామ సర్పంచ్ రాజ్ కుమార్. మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల మోహన్ రావు. ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్. నాకు కూడా గ్రామ కమిటీ అధ్యక్షుడు నీరటి శేఖర్ ముదిరాజ్. నీరటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీపీ జయమ్మ

## చేవెళ్ల బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు కోసం భార్య చంద్రకళ ప్రచారం

### నర్కూడలో భారీ ఊరేగింపు

శంషాబాద్, మే 2. (ప్రభాత ఉదయం) బడుగు బలహీన వర్గాల ప్రతినిధి టిఆర్ఎస్ పార్టీ చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం అభ్యర్థి జ్ఞానేశ్వర్ ముదిరాజును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ నర్కూడ గ్రామంలో గురువారం సాయంత్రం ఊరేగింపు నిర్వహించారు. జెడ్పిటిసి నీరటీ తన్వి రాజు ముదిరాజ్ మండల పార్టీ అధ్యక్షుడు కొడిగంటి చంద్ర రెడ్డి. గ్రామ టిఆర్ఎస్ అధ్యక్షుడు నీరటి శేఖర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఊరేగింపులో కాసాని జ్ఞానేశ్వర్ భార్య చంద్రకళ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.కాసాని జ్ఞానేశ్వర్ ను గెలిపిస్తే పార్లమెంటులో ప్రజా సమస్యలపై గళం ఎక్కుతారని అన్నారు. జీవితం బీసీ వర్గాల అభ్యున్నతి కోసం త్యాగం చేసిన ఆయనను తప్పకుండా గెలిపించాలని ఆమె కోరారు. బడుగు బలహీన వర్గాల వారి సంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేసిన కాసాని జ్ఞానేశ్వర్ ని గెలిపించడం కోసం కారు గుర్తుపై ఓటు వేయాలని కొడిగంటి చంద్రారెడ్డి కోరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దీపా మల్లేష్. సందవేల్లి శ్రీనివాస్. హీరే కార్ శివాజీ. నీరటి కృష్ణ ముదిరాజ్. అశోక్. లింగం రామారావు తదితరులు పాల్గొన్నారు.


ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న మండల బిఆర్ఎస్ అధ్యక్షులు కొడిగంటి చంద్రారెడ్డి

## ఓటర్లు నిర్భయంగా ఓటు వేయాలి

### రాజేంద్రనగర్ ఏసిపి తుల శ్రీనివాస్

బుద్వేల్, మే2(ప్రభాత ఉదయం) : ఈనెల 13న జరిగే పార్లమెంటు ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా తమ ఓటును వేయాలని రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్ కోరారు. అత్తాపూర్ ఇన్స్పెక్టర్ వెంకటరామిరెడ్డి తో కలిసి గురువారం సాయంత్రం ఇంద్రానగర్, సులేమాన్ నగర్, హసన్ నగర్ ప్రాంతాలలో పోలీసులతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ, ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు తమ ఓటును వేయాలన్నారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రౌడీ షీటర్లు, దౌర్జన్యాలకు పాల్పడే వారి పట్ల నిగ పెట్టామన్నారు.

విలేకరుల నుద్దేశించి మాట్లాడుతున్న రాజేంద్రనగర్ ఏసిపి తుల శ్రీనివాస్. చిత్రంలో అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ వెంకట్రామిరెడ్డి



ఫ్లాగ్ మార్చ్ లో పాల్గొన్న మహిళా పోలీసులు


ఫ్లాగ్ మార్చ్ లో సీఆర్పీఎఫ్ పోలీసులు



పోలీసుల కవాతు

